



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : బుధవారం
సా.. 6.30 గం॥
సహర్ : గురువారం
ఉ..5.09 గం॥



మానుకోటలోని మోడల్‌స్కూల్ పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

విజయీభవ

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు షురూ

- జిల్లాలో 20 సెంటర్ల ఏర్పాట్లు
- హాజరు కానున్న 9,317 మంది విద్యార్థులు
- సీసీ కెమెరాల నిఘాలో నిర్వహణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 3,196మంది, వొకేషనల్ 1,199 మొత్తం 4,395 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 3,716, వొకేషనల్ విద్యార్థులు 1,206 మొత్తం 4,922 విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రథమ, ద్వితీయ జనరల్, వొకేషనల్ విద్యార్థులు మొత్తం 9317 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొత్తం మహబూబాబాద్ జిల్లాలో 20ఎగ్జామ్ సెంటర్లను సంబంధిత అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని

మిగతా 8వ పేజీలో...

20 మంది చీఫ్‌సూపరింటెండెంట్లు..


ఇంటర్ పరీక్షలకుగాను 20 మంది చీఫ్‌సూపరింటెండెంట్లు, డెవలప్‌మెంట్ అఫీసర్లు, ఇద్దరు కస్టోడియన్ అధికారులు, 1 ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు 240 మంది ఇన్విజిలేటర్లతో విధులు నిర్వహించనున్నారు. అన్ని సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా అన్ని చర్యలు చేపట్టారు. అంతే కాకుండా విద్యార్థులు ఎవరైనా అస్వస్థతగురైతే వెంటనే చికిత్సనందించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా, మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలుర, బాలికల. ఎస్వీ జూనియర్ కళాశాల సెంటర్లను జిల్లా ఇంటర్ విద్యాధికారి మదార్‌గౌడ్ సందర్శించి సీటింగ్ అలాట్‌మెంట్ ఏర్పాట్లను పసరిశీలించారు. మానుకోటలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు చేశారు.

మహిళా సంఘాలకు త్వరలో ఎన్నికలు

- ఎలక్షన్ నిర్వహణకు సిబ్బందికి శిక్షణ పూర్తి
- జిల్లాలో 15,423 స్వయం సహాయక సంఘాలు
- మొత్తం 1.54 లక్షలకుపైగా సభ్యులు

కొత్త నిబంధనలతో కమిటీల నియామకం





కేసముద్రం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆర్థిక స్వావలంభన కోసం ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నారు. నూతన తెలంగాణ పరస్పర సహాయ సహకార సంఘాల (మాక్స్) చట్టం ప్రకారం.. ఈ సంఘాలకు కొత్త కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న చట్టం ప్రకారం ఏర్పాటైన మహిళా సంఘాల కమిటీలన్నీ రద్దు చేసి, నూతనంగా మళ్లీ కమిటీలను వేయనున్నారు.

జిల్లాలో 15,423 స్వయం సహాయ సంఘాలు (ఎస్‌హెచ్‌జీ)లు ఉన్నాయి. ఇందులో సంఘానికి కనీసం 10మంది చొప్పున 1,54,230 మందికిపైగా సభ్యులు ఉన్నారు. అత్యధికంగా కేసముద్రం మండలంలోనే 1627 సంఘాలు ఉండడం గమనార్హం. ఒక గ్రామంలోని స్వయం సహాయక సంఘాలు కొన్ని కలిసి గ్రామైక్య సంఘంగా ఏర్పాటు చేస్తారు. గ్రామైక్య సంఘాలు మండల సమాఖ్యగా మండల సమాఖ్యల నుంచి ప్రతినిధులు జిల్లా సమాఖ్యగా ప్రాతినిథ్యం వహిస్తారు. పభుత్వం నూతనంగా మహిళల ఆర్థిక స్వావలంభన కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తరుణంలో కొత్తగా ఏర్పాటైన చట్టం ప్రకారం కమిటీలను ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఏర్పడింది. వచ్చేనెలలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల నిబంధనలు, నిర్వహణ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఐకేపీ ఏపీఎంలు, సీసీలకు, మండల స్థాయిలో వీవోఏలకు, గ్రామైక్య సంఘాల ప్రతినిధులకు శిక్షణ సైతం పూర్తి చేశారు.

ఒక సభ్యురాలు జిల్లా కమిటీకి వెళ్లే అవకాశం..

నూతన మాక్స్ చట్టం ప్రకారం గ్రామంలో స్వయం సహాయ సంఘాల్లో సాధారణ సభ్యులు కూడా గ్రామైక్య, మండల, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అయ్యే అవకాశం ఉంది. గతంలో స్వయం సహాయక సంఘాల అధ్యక్షురాళ్ల నుంచే గ్రామైక్య సంఘం అధ్యక్షురాలిని ఎన్నుకునే వారు. గ్రామైక్య సంఘం అధ్యక్షుల్లోంచే మండల సమాఖ్య మండలాలను ఈ మండల కమిటీల అధ్యక్షులతో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలి నియామకం జరిగేది. నూతన నిబంధనల ప్రకారం రెండు, మూడు స్వయం సహాయక సంఘాలతో ఒక 'నియోజకవర్గం'గా ఏర్పాటు చేస్తారు. ఈ సంఘాల సభ్యుల్లోంచి నుంచి 12 నుంచి 15 మందితో రిజర్వు జనరల్ బాడీ(ఆర్‌జీబీ) సభ్యులను ఎన్నుకుంటారు. ఈ సభ్యులోంచే కార్యనిర్వహణ కమిటీ(ఈసీ) సభ్యులను ఎన్నుకుంటారు. ఈసీ సభ్యులోంచి ఆఫీస్ బేరర్(ఓబీ)లు అనగా అధ్యక్ష, కార్యదర్శ, కోశాధికారు(పీఎస్‌టీ)లను నియమిస్తారు. ఇదే విధానాన్నే మండల, జిల్లా సమాఖ్యల ఎన్నికల్లోను అనుసరిస్తారు. సంఘంలో ఐదుగురు, మండల, జిల్లా సమాఖ్యలో ముగ్గురి చొప్పున పీఎస్‌టీలను ఏర్పాటు చేస్తారు. గ్రామైక్య సంఘాల అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారుల పదవీకాలం ఐదేళ్లు ఉండగా మండల, జిల్లా సమాఖ్య కమిటీకి మూడేళ్ల కాలం ఉంటుంది.

పదవులకు 'డ్రా' గండం..

నూతన సహకార ఎన్నికల నిబంధనల్లో ఈసీ సభ్యులకు డ్రా పద్ధతిన ఏడాది నుంచి ఐదేళ్ల పదవీ కాలం నిర్ణయిస్తారు. డ్రాలో ఎన్ని సంవత్సరాల పదవీ కాలం వస్తే అక్కడి వరకే వారు ఈసీ సభ్యులుగా ఉంటారు. అయితే ఈసీ పదవీకాలం ముగియగానే వారు అప్పటికే మండల, జిల్లా సమాఖ్యల్లో పీఎస్‌టీలు అయినప్పటికీ తమ పదవిని వదులుకోవాల్సిందే. ఉదాహరణకు ఒక గ్రామస్థాయి ఈసీ సభ్యురాలు మండల, జిల్లా సమాఖ్య కమిటీల వరకు వెళ్లినప్పటికీ ఆమె ఈసీ సభ్యత్వం డ్రాలో ఏడాది పదవీకాలం వస్తే అన్ని స్థాయిల్లోని పదవులను వదులుకోవాల్సిందే. నూతన విధానంలో సాధారణ సభ్యురాలు జిల్లా కమిటీకి వెళ్లే అనుకూల అంశంతోపాటు డ్రా ద్వారా అన్ని పదవులను కోల్పోయే ప్రతికూల నిబంధనలతో వైకుంఠపాళి (నిచ్చెన, పాము) ఆటలాగ ఉన్నట్లు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఏదేమైనప్పటికీ నూతన చట్టం ప్రకారం జిల్లాలోని అన్ని స్వయం సహాయక సంఘాలకు ఎన్నికలు నిర్వహించి వివిధ స్థాయిల్లో కొత్త కమిటీల ప్రతినిధులు కొలువుదీరనున్నారు.

మండలాల వారీగా స్వయం సహాయక సంఘాల సంఖ్య

మండలం	ఎస్‌హెచ్‌జీ
బయ్యారం	1,178
చిన్నగూడూరు	346
దంతాలపల్లి	759
డోర్నకల్	934
గంగారం	260
గార్ల	901
గూడూరు	1,493
కేసముద్రం	1,627
కొత్తగూడ	659
కురవి	1,514
మహబూబాబాద్	945
మరిపెడ	1,161
నర్సింహులపేట	688
నెల్లికుదురు	1,185
పెద్దవంగర	678
తొర్రూరు	1,095
మొత్తం	15,423

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

- మునిసిపల్ కమిషనర్ రవీందర్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి) : మానుకోట మునిసిపాలిటీ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని, ఈ నెల 31వ తేదీలోగా ప్లాట్ల యాజమానులు ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లించి, దానిపై 25 శాతం రాయితీ పొందాలని మునిసిపల్ కమిషనర్ రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020 సంవత్సరంలో రూ.1000 చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ కోసం రిజిస్టర్ చేసుకున్న ప్లాట్ల యాజమానులు అనుమతి లేని అనధికార, అక్రమ లేవుట్‌లోని ఖాళీ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 31 మార్చి 2025 వరకు అవవకాశం ఇచ్చిందని తెలిపారు. మార్చి 31 లోపు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించే వారికి 25 శాతం రాయితీ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు మునిసిపల్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగంలో సంప్రదించాలని చెప్పారు.

ఫటాఫట్

ఇసుకాసురులపై నిఘా

- సీఐ రవికుమార్



బయ్యారం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను వెలికితీసి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇసుకాసురులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ రవికుమార్ పేర్కొన్నారు. శాంతిభద్రతల విషయంలో రాజీపడేది లేదని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. బయ్యారం సీఐతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ.

ఆంధ్రజ్యోతి : ఇసుక అక్రమ రవాణాపై ఎలాంటి చర్యలు చేపట్టారు.

సీఐ : ఇసుక అక్రమ రవాణకు పాల్పడకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. సమీప ఏరు, వాగుల్లో ఇసుకను వెలికితీయకుండా జేసీబీలతో కంధకాలు తవ్వించాం. బ్లూకోట్ పోలీసులు సైతం నిరంతరం నిఘా పెట్టారు.

ఆంధ్రజ్యోతి : వరుస చోరీల తరుణంలో నియంత్రణకు నిఘా ఏర్పాటు చేశారా?

సీఐ : బయ్యారం సర్కిల్ పరిధిలో చోరీల నియంత్రణకు ప్రత్యేక పోలీస్ నిఘా విభాగం పని చేస్తుంది. గత నేర చరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తూ వారి ప్రస్తుత కదలికలను పసిగడుతున్నాం.

ఆంధ్రజ్యోతి : శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నారా?

సీఐ : శాంతి భద్రతల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సి పని లేదు. రాత్రి వేళల్లో స్పెషల్ పార్టీ పోలీసు బలగాలచే ముమ్మర గస్తీ నిర్వహిస్తూ, అపరిచిత వ్యక్తుల సంచారంపై నిఘా ఏర్పాటు చేశాం. ప్రజలు కూడా శాంతి భద్రల పరిరక్షణకు సహకరించాలి. ఇళ్ల వదిలి ప్రయాణాలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రామాల్లో ఎవరైన కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎస్సెస్సీలో అందరూ ఉత్తీర్ణత సాధించేలా సంసిద్ధులను చేయాలి
- రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి



హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపించిన తరుణంలో.. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) సత్యనారాయణరెడ్డి సూచించారు. మహబూబాబాద్‌లో డీఈవో రవీందర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ఎస్సెస్సీ వార్షిక పరీక్షలకు హాజరయ్యే ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా సంసిద్ధులని చేయాలన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు నిర్వహించిన స్పెష ల్ రీజియన్ టెస్టులు, గ్రాండ్ టెస్టు ఫలితాలను విశ్లేషించి, వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. సబ్జెక్టుల ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. 8, 9 తరగతుల విద్యార్థులలో బెస్ట్‌విషేష్ చెప్పించాలన్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్, ఎల్ఐపీలలో విద్యార్థుల యొక్క బేస్‌లైన్, మిడ్‌లైన్ ఫలితాలను త్వరగా నమోదు చేయాలన్నారు. పాఠశాలల్లో మెనూ పాటించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు పూర్తి చేయాలన్నారు. ఆధార్ అప్డేట్, అపార్ జనరేట్, ఈపీ, జీపీలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, హెచ్‌ఎంలు అకాడమిక్ గైడెన్స్ రిజిష్టర్‌లో నమోదు చేసి తెలగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రభు త్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఏడీ రాజేశ్వర్‌రావు, చంద్రశేఖర్ ఆజాద్, విజయకుమారి, అప్పారావు పాల్గొన్నారు.

మార్కెట్‌కు 12 వేల బస్తాలకు పైగా మిర్చి రాక



మహబూబాబాద్ మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి రాబడులు భారీగా కొనసాగుతున్నాయి. మంగళవారం 12 వేల బస్తాలకు పైగా మిర్చి రాబడులు వచ్చాయి. సుమారు 8518 బస్తాలకు ఈ నామ్ మార్కెట్‌లో ఖరీదులు కాగా, యార్డులో ఇంకా 3500 బస్తాలకు పైగా వేలం పాటలు కాకుండ ఉన్నాయి. మిర్చికి క్వింటాపై గరిష్ట ధర రూ.14175 పలుకగా, కనిష్ట ధర రూ.10 వేలు, సగటున రూ.13769 ధర పలికింది. కేసముద్రం మార్కెట్‌లో 4 వేల బస్తాలకు పైగా మిర్చి రాబడులు కొనసాగాయి. ఈ మార్కెట్‌లో గరిష్టంగా రూ.13891 ధర పలుకగా, కనిష్ట ధర రూ.10,051 పలికింది. సగటున రూ.13819 ధర పలికింది.

పగలు యార్డులోకి మిర్చిని అనుమతించం

మహబూబాబాద్ మార్కెట్ యార్డుకు అధికంగా మిర్చి వస్తున్న కారణంగా ప్రతిరోజు ఉదయం 7నుంచి రాత్రి 9గంటల వరకు మిర్చి బస్తాలను లోనికి అనుమతించబోమని చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ తెలిపారు. రాత్రి 9గంటల తర్వాత వచ్చిన మిర్చి మాత్రమే అనుమతించబడుతాయని, రైతులు సోదరులు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

యూవిన్ పోర్టల్‌పై అవగాహన ఉండాలి

- డీఎంహెచ్‌వో మురళీధర్



సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్

నెహ్రూసెంటర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ప్రసూతి వైద్యశాలల్లో నమోదవుతున్న గర్భధారణ, నవజాత శిశువుల నమోదు, పిల్లల టీకాలు నమోదయ్యేలా యూవిన్ పోర్టల్‌పై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌వో మురళీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్లో మంగళవారం నిర్వహించిన డేటా ఎంట్రీ ఆపరేటర్లకు యూవిన్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్య సౌకర్యాలు, యూవిన్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని డెలవరీ పాయింట్లలో యూవిన్ పోర్టల్‌ను బలోపేతం చేయాలని సూచించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న 22ప్రైవేట్ ఆస్పత్రులు డెలవరీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో వైద్యం కోసం వచ్చే గర్భిణులు, నవజాత శిశువుల టీకాలు, డెలవరీల వివరాలను నవీకరించాలన్నారు. పీహెచ్‌సీ, జీజీహెచ్, సీహెచ్‌సీ, 22 ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, కొప్పుల ప్రసాద్, కేవీ రాజు, వడ్డెబోయిన శ్రీనివాస్, సౌమిత్, శ్రీనివాస్, ఉమాశంకర్ పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి కరెంట్ షాక్‌తో యువకుడి మృతి

ముగ్గురిపై కేసు



జర్పుల శశి (ఫైల్)

మరిపెడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : కరెంట్‌తో చేపలు పట్టడానికి స్నేహితులతో కలిసి వెళ్లిన ఓ యువకుడు అదే కరెంట్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని పురుషోత్తమాయంగూడెం ఆకేరు నదిలో చోటు చేసుకుంది. ఇందుకు కారకులైన జర్పుల శ్రీను, భానోత్ బాలు, భానోత్ యోగిలపై కేసు నమోదైంది. స్థానికులు, మరిపెడ పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం... పురుషోత్తమాయగూడెంకు చెందిన జర్పుల శశి(18) తన స్నేహితులతో కలిసి చేపల వేటకువెళ్లి ఛాతిపై విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందారు. మృతుడికి తల్లిదండ్రులు ఉన్నారు. మృతుడి తల్లిదండ్రులు కోట్యా-అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు మరిపెడ ఎస్సై బోలగాని సతీశ్‌గౌడ్ తెలిపారు.

కోళ్లు ఇంట్లోకి వచ్చాయని.. వ్యక్తి కాళ్లు నరికాడు

కురవి మండలం సూదనపల్లిలో ఘటన



గాయపడిన సోమయ్య

కురవి, మార్చి4 (ఆంధ్రజ్యోతి) : కోళ్లు ఇంటోకి వచ్చాయని.. ఓ వ్యక్తి కాళ్లు నరికిన ఘటన సూదనపల్లిలో చోటు చేసుకుంది. మంగళవారం ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం. మేకల లింగయ్య, కొండ సోమయ్యలవి పక్కపక్క ఇళ్లు. సోమయ్య కోళ్లు.. తరుచుగా లింగయ్య ఇంట్లోకి వచ్చి ఆగం చేస్తున్నాయి. దీంతో ఈ విషయమై సోమవారం రాత్రి ఇరువురు ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో మాటమాట పెరగడంతో ఆగ్రహించిన లింగయ్య గొడ్డలితో సోమయ్య మోకాళ్లపై నరికాడు. కుడికాలుకు స్వల్పగాయం కాగా, ఎడకాలు మోకాలు.. భాగంలో తీవ్ర గాయమైనట్లు ఎస్సై తెలి పారు. ప్రస్తుతం సోమయ్యను మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స నందిస్తున్నారు. కాలుకు రాడ్లు వేయాల్సి వస్తుందని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎండ దెబ్బతో వృద్ధుడికి అస్వస్థత

మరిపెడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఎండదెబ్బకు గురై ఓ వృద్ధుడు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన మంగళవారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని హెరిటేజ్ పాల కేంద్రం దగ్గర చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మరిపెడ విలేజీకి చెందిన కంచనపల్లి సాయిలు మరిపెడ బంగ్లాకు పనిమీద వచ్చి ఎండకు అస్వస్థతకు గురై ఓ దుకాణం దగ్గర పడిపోయారు. గుర్తించిన ఇరుగుపొరుగు వారు 108 సిబ్బందికి సమాచారం అందించి అతని ఫొటోను సోషల్ మీడియలో వైరల్ చేశారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకొని 108 వాహనం ద్వారా చికిత్స కోసం మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుంది.

ముగ్గురికి ఆరు నెలల జైలు శిక్ష

డోర్నకల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలలోని కస్నాతండా గ్రామపంచాయతీ పరిధిలోని బోడమంజాతండాకు చెందిన ఓ వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులకు ఆరు నెలల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు అదనపు జూనియర్ జడ్జి తిరుపతిరావు మంగళవారం తీర్పునిచ్చారు. సీఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం. బోడమంజాతండాకు చెందిన బోడ సాములుపై అదే తండాకు చెందిన బోడ మల్సూర్, వీరన్న, జగ్నా అనే ముగ్గురు వ్యక్తులు కలిసి 2019 జూలై 6న దాడి చేశారు. బోడ సాములు తన భూమిని సర్వేయర్‌తో కొలుస్తున్న సమయంలో నిందితులు దాడికి పాల్పడినట్లు చెప్పారు. ఈ దాడిలో సాములు తీవ్రంగా గాయాలయ్యాయి.

ఈ విషయంపై బాధితుడు సాములు డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సాముల ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ శ్యాంసుందర్ కేసు నమోదు చేసి చార్జీషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సీఐ రాజేష్, కోర్టు కానిస్టేబుల్ నవీన్‌కుమార్‌లు 12 మంది సాక్షులను ప్రవేశపెట్టగా, కేసును ఏపీపీ పి.జయలత ప్రాసిక్యూషన్ తరుపున వాదోపవాదాలు వినిపించారు. వాదనలు విన్న మహబూబాబాద్ జిల్లా కోర్టు అదనపు జూనియర్ జడ్జి తిరుపతిరావు ఒక్కొక్కరికి ఆర్నెళ్ల జైలు, రూ.1000 చొప్పున జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు.

వేసవికాలం.. గృహజ్యోతి భారం

- 200 యూనిట్లు దాటితే వర్తించని పథకం
- పొదుపుగా వాడుకోవాలని అధికారుల సూచన

తొర్రూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో ఎండవేడికి ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వేసవి తాపం నుంచి తప్పించుకునేందుకు ఏసీలు, ఫ్యాన్‌లు, కూలర్లను వినియోగిస్తున్నారు. దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. జిల్లాలో గరిష్ఠంగా రోజుకు 4.51 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియో గిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా, గృహజ్యోతి పథకం కింది ఉచిత విద్యుత్ పొందుతున్న లబ్ధిదారులకు సైతం 200యూనిట్ల వరకు జీవో బిల్లును అందజేస్తున్నారు. 200 యూనిట్లు దాటితే బిల్లులు పడుతున్నాయి.

రూ.3కోట్లు ప్రభుత్వమే చెల్లిస్తోంది

జిల్లాలో గృహజ్యోతి పథకం కింద 1.49.910 మంది లబ్ధిదారులు ఉండగా వారికి ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద 200యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగిస్తున్న వారికి సంబంధించిన బిల్లులను ప్రభుత్వమే రూ.3కోట్ల మేర చెల్లిస్తోంది. వేసవి దృష్ట్యా విద్యుత్ వినియోగం పెరిగిపోవడంతో 200 యూనిట్లు దాటిన వారంతా బిల్లులు చెల్లిస్తున్నారు. దీంతో విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి



ఎండాకాలంలో ఎండ వేడిమి నుంచి తట్టుకునేందుకు ప్రజలు ఏసీలు, కూలర్‌లు అధికంగా వినియోగిస్తున్నారు. అవసరం ఉన్న సమయంలోనే వాడుకుని విద్యుత్‌ను పొదుపు చేసుకోవాలి. వచ్చేది వేసవికాలం కాబట్టి విద్యుత్ వినియోగం పెరుగుతుంది. గృహజ్యోతి లబ్ధిదారులు పొదుపుగా వాడుకుని ఆదా చేసుకోవాలి.

\- మధుసూదన్, విద్యుత్ డివిజనల్ ఇంజనీర్



ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

1.75లక్షల గృహ వినియోగదారులు

జిల్లాలో 1.75.226 గృహ విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. వారిలో 1,49,910 గృహజ్యోతి లబ్ధిదారులు. వారిలో ఫిబ్రవరి నెలలో 2082 మందికి 200 యూనిట్లు దాటగా అధికారులు అదనపు విద్యుత్ వాడకానికి బిల్లులు అందజేశారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు పెరిగే అవకాశం ఉంది. దీంతో అధికంగా విద్యుత్ వినియోగించేవారి సంఖ్య మరింత పెరుగుతుంది. ఉచిత విద్యుత్ దాటితే బిల్లులు చెల్లించాల్సిందే అని అధికారులు చెప్తున్నారు. విద్యుత్‌ను పొదుపు చేయడం ద్వారా బిల్లులు తగ్గించుకోవచ్చని అంటున్నారు.

రామప్పలో 'ప్రసాద్' పనులు పూర్తి చేయాలి

ములుగు కలెక్టర్ దివాకర

వెంకటాపూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో ప్రసాద్ స్కీం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి పాలంపేటలోని రామప్పలో ప్రసాద్ స్కీం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ మే 2న ప్రపంచ సుందరి పోటీలు జరగనున్న నేపథ్యంలో పలు దేశాలకు చెందిన పోటీ మహిళలు హైదరాబాద్‌కు రానున్నారని అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పర్యాటక స్థలాలను పర్యటించే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని సంబంధిత శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ప్రసాద్ స్కీం ద్వారా చేపట్టిన పనులను ఏప్రిల్ 20లోగా పూర్తి చేయాలని, రామప్ప పరిసర ప్రాంతాన్ని సుందరీకరించి గ్రీనరీ పెంచాలని సూచించారు. కాకతీయ కట్టడాలను ప్రపంచ వ్యాప్తంగా తెలియజేయడానికి విదేశీ పర్యాటకులకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో మొదటిసారి ప్రపంచ సుందరి పోటీలు నిర్వహిస్తున్న సందర్భంగా ఆయా దేశాల సుందరీమణులను పర్యాటక ప్రాంతాలకు తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రపంచ దేశాల పర్యాటకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో వెంకటేశ్, డీపీవో దేవరాజ్, టూరిజం ప్రమోషన్ అసిస్టెంట్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, పర్యాటక అభివృద్ధి సంస్థ అధికారి ధన్‌రాజ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్‌కుమార్, ఎంపీడీవో రాజు, తహసీల్దార్ గిరిబాబు, ఎంపీవో విష్ణువర్ధన్, సైట్ ఇన్‌చార్జి, తదితరులు ఉన్నారు.



రామప్ప ఆలయంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

క్రీడారంగంలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

- మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్రస్థాయి పోటీల్లో రన్నరప్‌గా నిలిచిన బాలుర జట్టును అభినందిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : క్రీడారంగంలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బేస్‌బాల్ పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచిన బాలుర జట్టునుఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్, జిల్లా అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారితో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఫిబ్రవరి 28 నుంచి మార్చి 2 వరకు జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బేస్‌బాల్ పోటీల్లో బాలుర జట్టు ద్వితీయస్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవాలని సూచించారు. మహబూబాబాద్ జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిక్రీడల్లో రాణించిన క్రీడాకారులు ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో బెస్ట్ పిక్చర్‌గా అవార్డు అందుకున్న కేసముద్రం మోడల్ స్కూల్ విద్యార్థి పరమేష్, జిల్లా బేస్‌బాల్ క్రీడాకారులు పతకాలు సాధించేలా ప్రోత్సహిస్తున్న అసోసియేషన్ సెక్రటరీని అభినందించారు. ఈ కార్యక్రమంలో బేస్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ కల్లూరి ప్రభాకర్, జిల్లా యువజన క్రీడల అధికారి జ్యోతి పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

మానుకోట ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి పోలీస్‌శాఖ ఎల్లప్పుడు కృషి చేస్తుందని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం జిల్లా పోలీస్ స్పెషల్ పార్టీ, బాంబ్ స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్, సాయుధ సిబ్బందితో పోలీస్ దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌శాఖలో పనిచేసే ప్రతీ ఒక్కరు క్రమశిక్షణ కలిగి ఉండాలని, బాధ్యతగా తమ విధులను నిర్వరిస్తూ ప్రజలకు సేవలందించాలని సూచించారు. పోలీస్ వృత్తి నిర్వహణలో నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, ఇందుకోసం నిత్యం వ్యాయామం, యోగా, చేయడం అలవర్చుకోవాలని చెప్పారు. నిరంతరం విధుల్లో ఉండే పోలీస్ అధికారులు, సిబ్బందికి వ్యక్తిగత, కుటుంబపరమైన, శాఖపరమైన సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని చెప్పారు. వేసవి తాపానికి సిబ్బంది గురికాకుండా బారక్స్‌లో ఎయిర్ కూలర్, నీటి సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీలు తిరుపతిరావు, శ్రీనివాస్, విజయ్‌ప్రతాప్, సీఐ చంద్రమౌళి, సత్యనారాయణ, ఆర్‌ఐలు అనిల్, భాస్కర్, సోములు, నాగేశ్వర్‌రావు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా పోలీస్ కార్యాలయంలో దర్బార్‌లో మాట్లాడుతున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

ఇంటర్ పరీక్ష కేంద్రాల పరిశీలన



మరిపెడలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తొర్రూరు ఆర్డీవో గణేశ్

మరిపెడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మరిపెడలోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను మంగళవారం తొర్రూరు ఆర్డీవో గణేశ్ పరిశీలించారు. నేటి నుంచి జరిగే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండెంట్లను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట చిన్నగూడూరు తహసీల్దార్ మహబూబ్‌అలీ, ఆర్ఐ శరత్‌గౌడ్, ప్రిన్సిపాల్స్, చీఫ్ సూపరింటెండెంట్లు ఉన్నారు. అనంతరం మరిపెడ మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజన వంటలను తనిఖీ చేసి వంటలు సుచి, రుచిగా ఉండేలా చూడాలని వంట ఏజెన్సీ నిర్వాహకులు ఆర్డీవో ఆదేశించారు.

ఉరేసుకొని టెన్త్ విద్యార్థి ఆత్మహత్య

- బాలుడి స్వస్థలం నెల్లూరు జిల్లా
- కొడుకు మృతితో మనస్తాపం చెంది తల్లి ఆత్మహత్యాయత్నం



చిట్యాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ముచినిపర్తి గ్రామంలో మంగళవారం చోటుచేసు కుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ముచినిపర్తికి చెందిన భూపతి సారయ్య, జయ లక్ష్మి కుమార్తె రమ్యకు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరుకు చెందిన శ్రీరాం లక్ష్మయ్యతో ప్రేమ వివాహం జరిగింది. లక్ష్మయ్య, రమ్య నెల్లూరులోనే నివసిస్తుండగా వీరి ఏకైక కుమారుడు శ్రీరాం నాని (16) అమ్మమ్మ ఇంటి వద్ద ముచినిపర్తిలో ఉం టూ జూకల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం అమ్మమ్మ జయలక్ష్మి కూలి పనికి వెళ్లగా నాని పాఠశాలకు వెళ్తున్నానని బయల్దేరాడు.

బడికి వెళ్లకుండా మధ్యలోనే వెను తిరుగుతూ యూని ఫాం వేసుకొని వస్తానని తోటి విద్యార్థులకు చెప్పి ఇంటికి వెళ్లాడు. అమ్మమ్మ జయలక్ష్మి సాయంత్రం ఇంటికి రాగా లోపలి నుంచి తలుపులు వేసి ఉన్నాయి. ఎంత పిలిచినా పలకపోవడంతో చుట్టు పక్కల వారి సహాయంతో తలుపులు తొలగించి లోపలికి వెళ్లి చూడగా ఫ్యానుకు నాని ఉరేసుకుని ఉన్నాడు. మనవడిని విగత జీవిగా చూసిన జయలక్ష్మి భోరున విలపించింది.

కొడుకు ఇక లేడని తెలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడని తెలిసి నెల్లూరులో ఉంటున్న బాలుడి తల్లి రమ్య కూడా మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నం చేసిందని గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుతం ఆమె అక్కడ చికిత్స పొందుతోందని చెప్పారు. నాని ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఉంటున్న అతడి మేనమామ ప్రశాంత్ ముచినపర్తికి వస్తూ 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. నాని ఆత్మహత్యకు కారణాలు స్పష్టంగా తెలియరాలేదని చెప్పారు. అయితే.. నాని తల్లిదండ్రుల మధ్య మనస్పర్థలు ఉన్నాయని, దీంతో వారు తరచూ గొడవలు పడుతుంటారని తెలిపారు. ఈ విషయం తెలిసి మనస్తాపంతో నాని ఆత్మహత్య చేసుకొని ఉంటాడని తాను భావిస్తున్నానని చెప్పారు.

కొత్తూరు దేవునిగుట్టను సందర్శించిన ఎఫ్‌ఆర్‌వో

ములుగు కలెక్టరేట్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని కొత్తూరు శివారులో గల దేవునిగుట్టను మంగళవారం ఫారెస్ట్ రేంజ్ అధికారి డి.శంకర్ సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా ఆయన దేవునిగుట్టపై ఉన్న మెట్ల మార్గాన్ని పరిశీలించారు. ఈనెల 12నుంచి 14వతేదీ వరకు జరుగబోయే లక్ష్మీనర్సింహస్వామి జాతరకు కావాల్సిన ఏర్పాట్లు, వివిధ కార్యక్రమాల గురించి దేవస్థాన కమిటీ, గ్రామపెద్దలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌ఆర్‌వో రవికిరణ్, బీట్ ఆఫీసర్ శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.



మెట్ల మార్గాన్ని పరిశీలిస్తున్న ఎఫ్‌ఆర్‌వో శంకర్

జిల్లా అడవులను దాటిన పెద్దపులి?

కాటారం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలోని అటవీ ప్రాంతంలో కలవరం రేపిన పెద్దపులి సంచారానికి తెరపడిందని తెలుస్తోంది. కాటారం అటవీ శాఖ రేంజ్‌లోని దామెరకుంట సెక్షన్ పరిధి గుండ్రాత్‌పల్లి అడవుల నుంచి పెద్దపులి గోదావరి దాటి వెళ్లినట్లు సమాచారం. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులు ఇంకా ధ్రువీకరించడం లేదు. అన్నారం బ్యారేజీ సమీపం నుంచి గోదావరి దాటి మంచిర్యాల జిల్లా వైపు వెళ్లినట్లు టైగర్ ట్రాకర్స్‌కు పగ్ మార్క్స్ (పులి పాదముద్రలు) ఆనవాళ్లు లభించినట్లు తెలిసింది. మంగళవారం అటవీ శాఖ అధికారులు, ప్లాంటేషన్ వాచర్లు పలు బృందాలుగా పలు ప్రాంతాల్లోని అడవులను గాలించారు. పాదముద్రల ఆనవాళ్లు లభించ లేదని అధికారులు తెలిపారు.

దీంతో పులి జిల్లా సరిహద్దులను దాటి వెళ్లొచ్చని ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే ఇటీవల మల్హర్ మండలం పరిధిలోని కాపురం అడవుల్లో ఆవుపై దాడి చేసినట్లు ఆనవాళ్లు లభించగా అక్కడికి వచ్చిన ఆడపులి పెద్దపల్లి జిల్లా అడవుల్లోకి వెళ్లి తిరిగి ఇటు వైపు వస్తున్నట్లు సమాచారం. దీంతో మహదేవపూర్ అడవుల్లో సంచరించిన మగపులి గోదావరి దాటడానికి కారణం ఆ ఆడపులితో మేటింగ్ కోసమే కావచ్చని టైగర్ ట్రాకర్స్ అభిప్రాయపడుతున్నారు. పులుల సంచారంపై డీఎఫ్‌వో నవీన్‌రెడ్డిని అడగగా గుండ్రాత్‌పల్లి అడవుల నుంచి పులి గోదావరి దాటిందా లేదా? అనే విషయంపై క్లారిటీ రాలేదని, పెద్దపల్లి జిల్లా పరిధిలో సంచరించిన ఆడపులి కదలికలపై తెలుసుకుంటామన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

దంతాలపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : సోమవారం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడ్డ మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన డొనికెన సుభద్ర(75) మంగళవారం వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. స్థానిక ఎస్సై పిల్లల రాజు కథనం ప్రకారం.. ఈ నెల 3న మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఇంటికి వెళ్లేందుకు దాట్ల గ్రామానికి చెందిన సుభద్ర రోడ్డు దాటుతుండగా వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయాలపాలై మంగళవారం వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సుభద్ర మృతి చెందింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా కోయిలగుడెంకు చెందిన లారీ డ్రైవర్ షేక్ అహ్మద్ జలానాపై మృతురాలి కుమారుడు డొనికెన నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

తొర్రూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని అదనపు ఎస్సై రాంజీనాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వివిధ కూడళ్లలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతిలేని వాహనాలు, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్సు, ఆర్‌సీ కార్డు, ఇన్సూరెన్సు కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు మైనర్‌లకు వాహనాలు ఇస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ట్రైనీ ఎస్సై ఖాదర్, సిబ్బంది ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తొర్రూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు ఆధ్వర్యంలో గుండె జబ్బు ఉన్న వారికి ఉచితంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తొర్రూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిదిరాల నవీన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న లయన్స్ క్లబ్ ఆవరణలో వరంగల్‌లోని మెడికవర్ ఆస్పత్రి వైద్యులతో ఉచితంగా ఈసీజీ, టూడీఎకో ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరుగుతుందని, తొర్రూరు ప్రాంతంలో ఉన్న రోగులు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2331	2100
పల్లికాయ (సూక)	6900	6500
పల్లికాయ (పచ్చిది)	5600	5200
కందులు	6889	5540
పెసళ్లు	7002	4645
పత్తి	6920	5800
కొత్త పత్తి	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14200	9000
డిడి	13000	12500
వండర్‌హాట్	17000	11500
యూఎస్ 341	14100	9500
దేశీ	28100	25500
ఎల్లో మిర్చి	17000	15000
దీపిక	17100	15245
తాలు మిర్చి	6500	3000

\- వరంగల్ వ్యవసాయం

సక్సెస్ స్టోరీ



ఓ వీడియో చిత్రీకరణలో



సత్తాచాటిన శ్రీనివాస్‌యాదవ్

'విలేజ్ రత్నాల' విజయం

సినిమా స్పూఫ్‌లతో మెరుస్తున్న బెగ్లూర్ యువకుడు

- అనతికాలంలోనే 2 లక్షలకు పైగా సబ్‌స్క్రైబర్లు
- బృందం నుంచి ఇద్దరికి సినిమాల్లో అవకాశాలు



కాలకేయ స్పూఫ్.. అతడు స్పూఫ్ వీడియో

మహదేవపూర్ రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయిలో వీడియోలు చేస్తూ వైరల్ అయ్యాడు ఓ యువకుడు. తనకు నచ్చిన, తనకు వచ్చిన ప్రతిభతో వీడియోలు చేస్తూ అనతికాలంలోనే రెండు లక్షల పైచిలుకు సబ్‌స్క్రైబర్లను సంపాదించుకున్నాడు. ఇంకేముందు మంచి ఆదాయంతో పాటు సినిమాల్లోనూ అవకాశాలు వస్తున్నాయి. సినిమా స్పూఫ్ వీడియోలతో విజయం సాధించిన ఆ విలేజ్ రత్నాలు సాధించిన విజయం గురించి ఇప్పుడు అందరూ చర్చించుకుంటున్నారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం బెగ్లూర్ గ్రామానికి చెందిన ముల్కల శ్రీనివాస్ యాదవ్ 2020లో ఆ ఊరిపేరుతో యూ ట్యూబ్‌లో ఓ ఛానల్ ప్రారంభించారు. రెండు సంవత్సరాల వరకు ఆశించిన స్థాయిలో ఛానల్ వీక్షకులకు చేరకపోవ డంతో.. ఆ ఛానల్ పేరును 'విలేజ్ రత్నాలు06'గా మార్చారు. అప్పటి నుంచి పది నిమి షాల నిడివి ఉన్న వీడియోలతో పాటు షార్ట్ వీడియోలను అప్‌లోడ్ చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలోనే 2022లో బాహుబలి-1లోని చివరి యుద్ధ సన్నివేశాన్ని స్పూఫ్ వీడియోగా చిత్రీకరించి అప్లోడ్ చేయడంతో అది వైరల్ అయ్యింది. యూట్యూబ్‌తో పాటు ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లోనూ మిలియన్ వ్యూస్ వచ్చాయి. దీనికితోడు నాటి బిగ్‌బాస్ విజేత వీజే సన్నీ ఆ వీడియోను తన ఇన్‌స్టా స్టోరీలో పెట్టడంతో వ్యూవర్‌షిప్ క్రమంగా పెరుగుతూ వచ్చింది. అప్పటివరకు వెయ్యి మంది మాత్రమే సబ్‌స్క్రైబర్లు ఉన్న ఆ ఛానల్‌కు ఒక్కసారిగా లక్షకుపైగా సబ్‌స్క్రైబర్లు రావడంతో ఛానల్‌లో వీడియోలు పాపులర్ అయ్యాయి.

స్పూఫ్ వీడియోలే..

ఒక్క షార్ట్ వీడియోతో వైరల్ అయిన విలేజ్ రత్నాలు.. మొత్తం స్పూఫ్ వీడియోలకే ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. టాలీవుడ్, బాలీవుడ్‌లో భారీ విజయం సాధించిన సినిమాల్లోని సన్నివేశాలను స్పూఫ్ వీడియో స్‌గా చిత్రీకరిస్తూ తనదైన శైలిలో యూట్యూబ్‌లో రాణిస్తున్నాడు శ్రీనివాస్ యాదవ్. ప్రధానంగా బాహుబలి, మగధీర, విక్రమార్కుడు, అరుంధతీ, అర్జున్ రెడ్డి, శ్రీమంతుడు లాంటి చిత్రాలతో పాటు బతుకుజట్కా బండి, మాక్ అసెంబ్లీ లాంటి స్పెషల్ స్పూఫ్ వీడియోలే మొదటి వరసలో నిలిచాయి. అలా పలు స్పూఫ్ వీడి యోలతో వైరల్ అయిన శ్రీనివాస్ యూట్యూబ్ సహా అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో తన మార్క్ చాటుకున్నాడు. యూట్యూబ్(ప్రైమరీ) ఛానల్‌లో 2.26లక్షల సబ్‌స్క్రైబర్లు ఉం డగా అనుబంధంగా ఉన్న మరో రెండు చానళ్లకు 40వేల సబ్‌స్క్రైబర్లను సంపాదిం చుకున్నాడు. ఇన్‌స్టాగ్రాంలో 1.80లక్షలు, ఫేస్‌బుక్‌లో 1.10లక్షలు, మోజ్‌లో 1.20లక్షల ఫాలోవర్లు ఉన్నారు.

సినిమా అవకాశాలు.. స్వయం ఉపాధి..

యూట్యూబర్ శ్రీనివాస్‌కు విలేజ్ రత్నాలు ఛానల్‌ను ఓ స్వయం ఉపాధిగా మలుచుకున్నాడు. షెడ్యూల్ వారీగా వీడియోలను విడుదల చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఛానల్ ద్వారా మంచి ఆదాయాన్ని ఆర్జించడమే కాకుండా మరికొంత మందికి ఆసరాగా నిలుస్తున్నాడు. గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు, చిన్నారుల్లో ఉన్న ప్రతిభను ప్రపంచానికి చూపెడుతూనే వారికి అండగా నిలుస్తున్నారు. చానల్‌లో నటించిన ఇద్దరు చిన్నారులకు పాన్‌ఇండియా సినిమా 'ప్రవాహం'లో నటించే అవకాశం వచ్చిం ది. వైజయంతి మూవీస్ ద్వారా వచ్చే సినిమాల్లోనూ నటించేందుకు ఆడిషన్స్ అవకాశం వచ్చింది. సినిమా లతో పాటు ప్రముఖ యూట్యూబ్ ఛానల్లలోనూ ఇంటర్వ్యూలకు హాజరవుతూ ప్రజల్లో నిలుస్తున్నారు.

ఒత్తిడిని జయిస్తే విజయం మీదే

- పరీక్షల వేళ మితాహారం మేలు
- సానుకూల దృక్పథంతో పరీక్షలకు హాజరవ్వాలి
- నేటి నుంచే ఇంటర్ పరీక్షలు



వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇది పరీక్షల కాలం.. విద్యార్థులు సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతూ ఒత్తిడిని జయిస్తే విజయతీరాలకు చేరుతారని మనోవికాస, విషయనిపుణులు, వైద్యులు సూచిస్తున్నారు. బుధవారం నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా ప్రశాంతమైన చింతనతో పరీక్షలకు హాజరుకావాలని సూచిస్తున్నారు. ఇక పరీక్షల వేళ సులువుగా జీర్ణమయ్యే ఆహారంతో పాటు సుఖవం తమైన నిద్ర అవసరమని వారు చెబుతున్నారు. ఎండలు మండు తున్న నేపథ్యంలో విద్యార్థులు నీటితో పాటు పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల నీరసం రా కుండా హుషారుగా పరీక్షలు రాసా ్తరని చె బుతున్నారు. ఇక పరీక్షల సమ యంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. పరీక్షల కాలంలో పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వారి మనోస్థైర్యాన్ని నింపాలని సూచిస్తున్నారు.

సానుకూల దృక్పథంతో హాజరవ్వాలి

పరీక్షల వేళ విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రతీ విషయంలో సానుకూ ల దృక్పథం తో ముందుకు సాగాలి. ఒత్తిడి లేకుండా విషయాలను పూర్తి స్థాయిలో అవగతం చేసుకునేం దుకు ప్రయత్నించాలి. పాఠ్యాంశాల్లో అనుమానాలు ఉంటే సబ్జెక్టు టీచర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలి. పాఠ్యాంశాలపట్ల పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి. ప్రశ్నా పత్రాలను చూసిన వెంటనే హైరానా పడకుండా ఒక సారి పూర్తిగా చదుకొని ప్రశ్నలను అర్థం చేసుకోవాలి. అనంతరమే అన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు మంచి చేతిరాతతో రాయాలి. పరీక్షల్లో ప్రతీ ప్రశ్నకు సమాధానం రాసేందుకు ప్రయత్నించాలి. ఎలాంటి ఆలోచనలు లేకుండా పూర్తిగా చదువుకొని పరీక్షలు రాసేందుకు సిద్ధపడాలి.

తల్లిదండ్రులు పిల్లల్లో ధైర్యం పెంచాలి..

పరీక్షల సమయంలో తల్లిదండ్రులు పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ఎలాంటి ఒత్తిడులు వారి దరిచేరకుండా చూసుకోవాలి. పరీక్షలకు సిద్ధమయ్యేలా మంచి వాతావరణాన్ని కల్పించి ప్రోత్సహించాలి. పరీక్షల సమయాల్లో టీవీలు, ఫోన్లు చూడటం లాంటివి పూర్తిగా మానేయాలి. పిల్లలకు పౌష్టికాహారాన్ని అందజేయాలి. పిల్లలు కంటి నిండా నిద్రపోయేలా ఏర్పాట్లు చేయాలి. విద్యార్థులను చదవాలని ఒత్తిడి చేయకుండా వారికి సానుకూల వాతావరణాన్ని ఇంట్లో ఏర్పాటు చేయాలి.

ప్రతీ రోజు వారు రాస్తున్న పరీక్షల వివరాలను తెలుసుకుంటూ వారిలో ఆత్మస్థైర్యం పెంపొందే మాటలు చెప్పాలి. పరీక్ష కేంద్రాలకు ముందుగానే తీసుకెళ్లి వారిని దగ్గరుండి కేంద్రంలోకి పంపించి రావాలి.

నిమిషం నిబంధనను ఎత్తేసిన ఇంటర్ బోర్డు

- ఐదు నిమిషాల వరకు అనుమతికి అవకాశం

ఇంటర్ విద్యార్థులకు కాస్త ఊరటనిస్తూ ఇంటర్ బోర్డు ఓ నిర్ణయం తీసుకుంది. గతంలో పరీక్ష సమయానికంటే ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా విద్యార్థులకు పరీక్షకు అనుమతించేవారు కాదు. పలు కారణాలతో ఆలస్యమైందంటూ పిల్లలు, వారి తల్లిదండ్రులు అక్కడి అధికారులు, పోలీసులను బతిమిలాడేవారు. అయినా అనుమతికి నిరాకరించడంతో ఆరోజు పరీక్ష రాయకుండా ఏడుస్తూ ఇంటి దారి పట్టే వారు. తీవ్ర మనోవేదనకు గురయ్యేవారు. ఈ పరిస్థితులను అర్థం చేసుకున్న ఇంటర్ బోర్డు ఈ ఏడాది నిమిషం నిబంధనకు పలికింది. పరీక్ష సమయానికి అయిదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతించాలని బోర్డు సెక్రెటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇది విద్యార్థులకు ఊరటనిచ్చే అంశం కాగా.. ఐదు నిమిషాల తర్వాత వచ్చిన వారికి ప్రవేశం ఉండదు. అందుకే విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందే కేంద్రాలకు చేరుకోవడం మంచిది.

సులువుగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి..

రవీందర్‌రెడ్డి, ఎంజీఎం డైటీషియన్

పరీక్షల వేళ విద్యార్థులు సులువుగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలి. ఎండలు మండుతున్న నేపథ్యంలో విద్యార్థులు నీటితో కూడి ఆహార పదార్థాలతో పాటు పండ్లు, పండ్ల రసాలు తదితరా లను ఆహారంగా తీసుకోవాలి. దోసకాయ, పుచ్చకాయ, ద్రాక్ష తదితర పండ్లను ఎక్కువగా తీసుకోవాలి. నూనె పదార్థాలను పూర్తిగా విస్మరించాలి. చిరుతిండ్లు, వేపుడు పదార్థాలు, బిర్యానీలు, మసాలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోకూడదు. ఫాస్ట్ ఫుడ్‌ను పూర్తిగా మానివేయాలి. మజ్జిగ, పెరుగు తదితర చలువ పదార్థాలను మాత్రమే ఆహారపదార్థాలుగా తీసుకోవాలి.

ఒత్తిడి జయిస్తే విజయం మీదే..

బరుపాటి గోపి, మనోవికాస నిపుణులు



ఇంటర్ విద్యార్థులు పరీక్షలను ఎలాంటి ఒత్తిడి లేకుండా రాయాలి. అందుకు తల్లిదండ్రులు సహాయసహకారాలు అందించాలి. విద్యార్థులు పరీక్షల సమయంలో అనవసరమైన ఆందోళన చెందకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. మంచి ఆహారం అందజేస్తూ వారిని పరీక్షలకు సానుకూల దృక్పథంతో ముందుకు సాగేలా కృషి చేయాలి. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో పరీక్ష హాల్లో ఒత్తిడికి గురికావద్దు. ప్రశ్నా పత్రం ఇవ్వగానే తొందరపడకుండా ప్రశ్నా పత్రాన్ని పూర్తిగా చదివి అర్థం చేసుకున్నాకే జవాబులు రాయడం ప్రారంభించాలి. పరీక్షకు ప్రశాంతమైన మనస్సుతో హాజరుకావాలి.

ఘాటులోనే గాఢ నిద్ర

మిర్చి బస్తాలపై ఆదమర్చిన అలసటతో అన్నదాతలు

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు మార్కెట్‌కు వచ్చిన పలువురు రైతులు ఆలసటతో ఘాటైన మిర్చి బస్తాలపైనే ఆదమరచి నిద్రిస్తుండడం మంగళవారం కేసముద్రం మార్కెట్లో కనిపించింది. 'ఆకలి రుచిఎరుగదు, నిద్ర సుఖమెరగదు' సామెతకు నిదర్శనం ఈ ఫొటోలు. ఓ వైపు మిర్చి ఘాటుతో యార్డులో దగ్గులు, తుమ్ములతో అక్కడ ఉండలేని పరిస్థితి ఉండగా కొందరు రైతులు మాత్రం అలసటతో ఘాటులోనే గాఢనిద్రలోకి జారుకున్నారు. నిద్ర వచ్చేవారికి మెత్తని పరుపులు అవసరం లేదని, కటిక నేలైనా ఘాటైన మిర్చి బస్తాలైనా ఒక్కటే అన్నట్లుగా ఉంది కదూ..

- కేసముద్రం, ఆంధ్రజ్యోతి



కేసముద్రం మార్కెట్ మిర్చియార్డులో బస్తాలపైనే ఆదమరిచి నిద్రిస్తున్న రైతులు



మట్టి బాటిల్ ఎంతో మంచిదయా!

ఓ వైపు ఎండలు తీవ్రమవుతున్నాయి. దీంతో ప్రజలు చల్లచల్లని పానీయాలు తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యానికి హాని కలగకుండా ఉండేలా.. సహజసిద్ధంగా మట్టి తయారైన బాటిళ్లు మార్కెట్లోకి వచ్చాయి. ప్రస్తుతం రంజన్లకు డిమాండ్ ఉన్న క్రమంలో.. ఇదిగో ఇలా మట్టితయారు చేసిన తక్కువ బరువున్న వాటర్‌బాటిల్ కొనేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. ప్లాస్టిక్ బాటిళ్ల వాడకం ఆరోగ్యానికి అంతగా మంచిది కాదని నిపుణులు చెబుతున్న నేపథ్యంలో ఇలాంటి మట్టిబాటిళ్లకు గిరాకీ పెరిగింది. సాధారణ ప్లాస్టిక్ బాటిళ్ల లాగానే ఇవి బరువు తక్కువగా ఉంటాయని, తేలికగా ఎటంటే అటు తీసుకెళ్లవచ్చని చెబుతున్నారు. హనుమకొండ అంబేద్కర్ జంక్షన్‌లో ఇలా మట్టిబాటిళ్లు కొనేందుకు జనం ఆసక్తి చూపుతుండగా.. వ్యాపారులు ఒక్కోబాటిల్‌ను రూ.100చొప్పున విక్రయిస్తున్నారు.

ఫొటో: 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

వైభవంగా అభయాంజనేయస్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు

కాటారం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలం లోని గుండ్రాత్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మల్లారంలో నిర్మించిన అభయా ంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠాప నోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమ య్యాయి గ్రామస్థులు, పలువురు దాతల సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మించగా అభయాం జనేయస్వామితో పాటు ఇతర విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు. ఈనేపథ్యంలో మంగళవారం గణపతిపూజ, పుణ్యావచ నం, అగ్ని ప్రతిష్ఠాహోమం, విగ్రహాల జలాధివాసం తదితర కార్యక్రమాలు జరిగాయి.



మహిమాన్వితుడు.. కొమ్మాల నరసింహుడు

ఆధ్యాత్మికం

- రాజగోపురంతో ఆలయానికి ప్రత్యేక శోభ
- వందల ఏళ్ల నాటి స్వామివారి రథం మరో ఆకర్షణ
- ఏటా జరిగే జాతరకు లక్షలాది మంది భక్తుల రాక
- రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 10న కల్యాణం , 14న జాతర, 18న రథోత్సవం





తూర్పు రాజగోపురంతో ఆలయగుట్ట, స్వామివారి మూలవిరాట్

గీసుగొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఎంతో మహిమ గల కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి.. భక్తుల కొంగుబంగారమై వెలుగొందుతున్నాడు. వరంగల్ మహానగరానికి 15కిలోమీటర్ల దూరంలో వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిలో కొమ్మాల సమీపంలో ఉండే ఈ ఆలయం ఆధ్యాత్మిక ప్రాధాన్యంతో పాటు చారిత్రక విశిష్టతనూ కలిగి ఉంది. 50అడుగులు గల రాతి గుట్టపై వందల ఏళ్ల నాడు ఇక్కడ లక్ష్మీనరసింహుడు స్వయంగా వెలియటం వల్ల స్వయంభూ దేవాలయంగా విరాజిల్లుతోంది. అంతేకాకుండా ఇక్కడి స్వామివారిని పాండవులు ఇలవేల్పుగా కొలిచినట్లు స్థలపురాణం చెబుతోంది. కాకతీయ రాజ్యాన్ని పాలించిన రుద్రమదేవి కూడా స్వామివారి కల్యాణోత్సవానికి వచ్చేదని ప్రతీతి. ఆలయగుట్టకు సమీపంలోనే పాండవులు సంచరించినట్లు ప్రచారంలో ఉన్న చిన్నగుట్టకూడా ఇప్పటికీ ఉంది. ఎంతో మహిమ గల లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయ ప్రాంగణంలో తూర్పు వైపున వెంకటగిరి అనే భక్తుడు రూ.80లక్షల విరాళాలతో నిర్మించిన రాజగోపురం ఆలయానికి ప్రత్యేక శోభనిస్తుంది. యేటా జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి రెండు లక్షలకు పైగా భక్తులు తరలొస్తుంటారు.

ఆలయ స్థలపురాణం

కొమ్మాల ఆలయానికి సంబంధించి స్థల పురాణం చెబుతున్న అంశాలు చూస్తే ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. కొన్ని వందల సంవత్సరాల క్రితం ఓ రైతు మొక్కజొన్న పంటను కోస్తూ అలసిపోయి చెట్టునీడన కూర్చుంటాడు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన ఓ బాలుడు పంటచేనును తాను కోసిపెడతానని, తనకు కొడవలి, తాగడానికి దూపబుడ్డి కావాలని చెబుతాడు. ఆ రైతు బాలుడికి కొడవలి ఇచ్చి దూపబుడ్డి కోసం వెళ్లి.. తిరిగి వచ్చే సరికి చేను మొత్తం కోసి ఉండడం, బాలుడు కనిపించకపోవడంతో ఆశ్చర్యపోతాడు. ఇక అదే రోజు రాత్రి ఆ రైతు కలలోకి ఆ బాలుడు వచ్చి తాను నరసింహస్వామినని ఇక్కడ ఉన్న గుట్టపై వెలుస్తున్నానని ఆలయాన్ని కట్టించాలని కోరతాడు. ఈ విధంగా ఆలయ నిర్మాణం జరిగిందని స్థానికులు చెబుతారు. 50అడుగుల ఎత్తులో ఉన్న గుట్టపై గల రాతిగుహలో స్వామివారు వెలియగా దాదాపు 700 సంవత్సరాల నుంచి కొమ్మాల జాతర కొనసాగుతోంది.

500 ఏళ్ల నాటి ఐదంతస్థుల రథం

ఎంతో ప్రాశస్త్యం ఉన్న కొమ్మాల లక్ష్మీనర్సింహుడి ఆలయంలోని.. 500 ఏళ్లనాడు రాతి చక్రాలతో నిర్మించిన ఐదు అంతస్థుల రథం ఆలయ ప్రాచీన వైభవానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఆలయ ప్రాంగణంలో ఈ రథాన్ని నిలిపేందుకు ఎత్తుగా ప్రత్యేక భవనాన్ని కూడా నిర్మించారు. ఏటా జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే రథోత్సవంలో ఈ రథంపైనే ఉత్సవమూర్తులను అశ్వ, హనుమ, సింహ, ఏనుగు, శేషవాహనాలపై కూర్చొబెట్టి ఆలయగుట్ట చుట్టు ప్రదక్షణలు చేయిస్తారు. ఉత్సవమూర్తులు ఆసీనులైన ఈ రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడి తన్మయత్వం పొందుతారు. రథోత్సవం కనుల పండువగా తెల్లవార్లు సాగుతుంది.

మైదాన ప్రాంత గిరిజనుల జాతరగా ప్రసిద్ధి


మైదాన ప్రాంత గిరిజనులు ఈ జాతరకు ఎక్కువ సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. దీంతో కొమ్మాల జాతరకు గిరిజన జాతరగా కూడా పేరుండేది. ఈ ప్రాంతంలో పుట్టిన గిరిజనులు ఎక్కడ ఉన్న ఈ జాతరకు కుటుంబ సమేతంగా వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు

స్వామివారికి10ఎకరాల మాన్యాలు

ఇక్కడి లక్ష్మీనరసింహుడికి ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ప్రసిద్ధ దేవాలయాలకు ఉన్నట్లుగానే దేవుడి మాన్యాల కింద పదెకరాలు ఉంది. విశ్వనాథపురం గ్రామ పంచాయతీ శివారులో వరంగల్ - నర్సంపేట ప్రధాన రహదారి పక్కన ఈ భూములున్నాయి. ఏటా ఈ భూములను కౌలుకు ఇస్తారు. పర్యాటక శాఖ ద్వారా అభివృద్ధి పరిచేందుకు ఈ భూములు కూడా ఎంతో ఉపయోగపడతాయని స్థానికులు అంటున్నారు. అలాంటి కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించి తీర్చిదిద్దాలని భక్తులు కోరుతున్నారు. ప్రధాన ద్వారం నుంచి ఆలయ గుట్ట వరకు సెంట్రల్ లైటింగ్‌తో డివైడర్లను ఏర్పాటు చేసి రోడ్డును విస్తరించాలని భక్తులు కోరుతున్నారు. అలాగే కాటేజీలు నిర్మించాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి..

గురువారం నుంచి 20వ తేదీ వరకు కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు, ఇందు కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ఈవో నాగేశ్వర్‌రావు, ఆలయ ట్రస్టీ ఛైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు తెలిపారు. 6న అధ్యయనోత్సవం, 7న తీర్థబిందె, ప్రాభోధకి, 8న నిత్యవిధి, పరమపదోత్సవం, 9న అంకురారోపణం, అగ్నిప్రతిష్ఠ, రక్షాబంధనం 10న ధ్వజారోహణం, దేవాతాహ్వానం, ఎదురుకోళ్లు, రాత్రి కల్యాణోత్సవం, 11న హనుమత్‌సేవ, వాహనసేవ, 12న నిత్యహోమం, సింహవాహన సేవ, 13న గరుడవాహన సేవా, 14న శకటయానోత్సవం, జాతర (ఆలయ గుట్టచుట్టూ బండ్లు తిరగడం), 15 నుంచి 17 వరకు మొక్కుబడులు, సేవలు, అర్చనలు, 18న రథోత్సవం, 19న పారువేట, పుష్పయాగం, నాగవెల్లి 20న శతఘటాభిషేకం, పండిత సన్మాన కార్యక్రమాలుఉంటాయని వివరించారు.



విశిష్టత గల రథం


కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు పరీక్ష సామగ్రిని అందిస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సతీష్‌గౌడ్

విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

గూడూరు, మార్చి4 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మణపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ విద్యార్థినులకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బుడిగె సతీష్‌గౌడ్ 68 మంది విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను అందించారు. ఈ సందర్భంగా బుడిగె సతీష్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఇంటర్ విద్యలో అత్యధిక మార్కులు సాధించిన వారు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూపతి శ్రీను, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ నాయకుల సంబరాలు

ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డి గెలుపుతో స్వీట్ల పంపిణీ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి4 (ఆంధ్రజ్యోతి) : నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్టీయూ-టీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్ రెడ్డి గెలుపొందడంతో జిల్లా కేంద్రంలో పీఆర్టీయూ-టీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి, మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డి గెలుపు ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి నాంది అన్నారు. పెండింగ్ డీఏలు, సీపీఎస్ రద్దు, ఆరోగ్యకార్డులు, గురుకుల, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు జీరో వన్‌జీరో ద్వారా వేతనాలు, ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సీఆర్టీలకు, కేజీబీవీ, సమగ్రశిక్ష ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ మొదలగు సమస్యల పరిష్కారానికి శాసన మండలిలో ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తారని తెలిపారు. నాయకులు రామోజీనాయక్, కాపరబోయిన సుజాత, బి.గీత, కల్లెం వెంకట్‌రెడ్డి, ఉమాదేవి, కొప్పుల నాగరాజు, గుగులోతు హల్యానాయక్, కోట కనకయ్య, వెంకన్న, గాయత్రి, శ్యామలాదేవి, లక్ష్మారెడ్డి, కోట్యానాయక్, చిట్టిబాబు, ప్రవీణ్, భోజన్, వీరన్న, కౌసల్య పాల్గొన్నారు.


నెహ్రూసెంటర్‌లో ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డి గెలుపుతో సంబురాలు జరుపుకున్న పీఆర్టీయూ-టీఎస్ నేతలు


నర్సింహులపేటలో బాణసంచాలు పేల్చి, మిఠాయిలు పంచుతున్న పీఆర్‌టీయూ నాయకులు

● నర్సింహులపేట, (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డి గెలుపొందడంతో పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో విజయోత్సవంలో భాగంగా నర్సింహులపేటలో టపాసులు పేల్చి, మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు ఎర్ర పూర్ణచందర్ మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పింగలి శ్రీపాల్‌రెడ్డి గెలుపొందడం శుభపరిణామమన్నారు. మండల ప్రధాన కార్యదర్శి కొండ సంజీవ, రాష్ట్ర, జిల్లా బాధ్యులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, హనుమాండ్ల వెంకట్‌రెడ్డి, ఎల్లారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, చంద్రమౌళి, నిరంజన్‌రెడ్డి, భూక్యా నరేష్, రాజు, వీరేందర్, కరుణాకర్‌రెడ్డి, యాకసాయిలు పాల్గొన్నారు.

● బయ్యారం, (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికలో పీఆర్‌టీయూ టీఎస్ బలపరిచిన పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఘన విజయం సాధించడంపై బయ్యారంలో మంగళవారం ఆ సంఘ ఉపాధ్యాయులు సంబురాలు జరుపుకున్నారు. స్థానిక బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు స్వీట్స్ పంచిపెట్టి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు యద్దనపూడి గాయత్రి, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్, మండల అధ్యక్షకార్యదర్శులు మోహన్, శ్రీనివాస్, సంఘ సభ్యులు రామారావు, రవి, సునీత, పల్లవి, శ్రీలత, వనజ పాల్గొన్నారు.

విజయీభవ

(5వ పేజీ తరువాయి)


మానుకోటలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఐఈవో మదార్‌గౌడ్

అధికారులు సూచించారు. ఉదయం 9 గంటలకే పరీక్షలు ప్రారంభమవుతాయని 9 గంటల తర్వాత 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా విద్యార్థులను అనుమతించనున్నట్లు ఇంటర్మీడియట్ విద్యాశాఖఆదేశాలను అమలు చేయనున్నారు. విద్యార్థులు నిర్ణీతసమయానికంటే ముందే పరీక్షలు రాసినపట్టికి 12 గంటల తర్వాతనే విద్యార్థులను పరీక్ష కేంద్రాల నుంచి పంపించనున్నట్లు తెలుస్తోంది.

పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆయా కేంద్రాల్లో మౌళిక వసతులు కల్పించామని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ చెప్పారు. మానుకోటలోని మోడల్‌స్కూల్, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల పరీక్ష కేంద్రాలను ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, జిల్లా అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారితో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలకు సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి లేవని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ 2023 అమల్లో ఉంటుందన్నారు. వారివెంట ఆర్డీవో కృష్ణవేణి, డీఎస్పీ తిరుపతిరావు, డీఈవో రవీందర్‌రెడ్డి ఉన్నారు.


ఉప్పరపల్లి సమీపంలో ఎండిపోయిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఎంసీపీఐ(యూ), బీఆర్ఎస్ నాయకులు

వట్టివాగు వెంట పంటలను కాపాడండి

కేసముద్రం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఉప్పరపల్లి, అర్పనపల్లి గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వట్టివాగు ఎండిపోవడంతో వాగు ఆధారంగా సాగు చేస్తున్న వెయ్యి ఎకరాల్లో వరి, మొక్కజొన్న ఎండిపోతోందని, వెంటనే ఆయా పంటలను కాపాడాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న, బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మంచాల యాకరాజ్యం డిమాండ్ చేశారు. ఉప్పరపల్లి శివారులోని వట్టివాగు వెంట నీళ్లులేక ఎండిపోయిన పంటలను మంగళవారం ఆయా పార్టీల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలుగూరు చెరువు, డీబీఎం 48 కాల్వ ద్వారా ఎస్ఆర్ఎస్పీ జలాలను వట్టివాగులోకి విడుదల చేసి వేలాది ఎకరాల పంటలను కాపాడాలని కోరారు. మాజీ సర్పంచ్ ఎలబోయిన సారయ్య, సంకు శ్రీనివాస్‌రెడ్డి, అంకిరెడ్డి యాకయ్య, గంట చిన్నవీరయ్య, బొల్లోజు రాంమోహనాచారి, కంచ భద్రయ్య పాల్గొన్నారు.

ముగిసిన వీరభద్రుని సప్తాహ్నికోత్సవం

కురవి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : అంకురార్పణతో ప్రారంభమైన వీరభద్రుని కళ్యాణ మహోత్సవాలు సోమవారం రాత్రి జరిగిన స్వామివారి రథోత్సవ ఊరేగింపు కార్యక్రమంతో ఏడురోజుల పాటు జరిగిన సప్తాహ్నికోత్సవ పూజా కార్యక్రమం పూర్తయింది. అంకురార్పణ పూజా కార్యక్రమం రోజున పాలవెల్లి మూకుళ్లలో నవధాన్యాలు నింపి స్వామివారి ఆలయంలో ఎనిమిది దిక్కులు ఉంచి, పూజలు నిర్వహించారు. అంకురార్పణ రోజున ధ్వజారోహణ పూజాకార్యక్రమం నిర్వహించి చండీశ్వరుణ్ణి ధ్వజారోహణ గావించి ఆయన ద్వారా అష్టదిక్పాలకులు, నవగ్రహాలను ఆహ్వానించి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు స్వామివారి నివేదలను సమర్పించారు. ప్రతిరోజు జరిగే హోమపూజలో ఉదయం, సాయంత్రం పద్నాలుగు రకాల పూజలతో స్వామివారికి నివేదనలు సమర్పించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు బాలకృష్ణ, శ్రీకాంత్, అనిల్, పుణ్యమూర్తి, విజయ్ నిర్వహించారు.


పారువేట కార్యక్రమంలో గ్రామ చివరన వీరభద్రునికి పూజలు జరుపుతునున్న గ్రామస్థులు

ఘనంగా బండ్లు తిరిగే కార్యక్రమం

శ్రీవీరభద్రస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం బండ్లు తిరిగే కార్యక్రమం ఘనంగా జరిగింది. రైతులు, గిరిజనులు ఎడ్ల బండ్లపై ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. నేరడ గ్రామం నుంచి రజకులు తీసుకువచ్చిన ప్రభబండి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీరభద్రుడి ఆలయానికి ఈ ప్రభబండి మీద రాళ్లు మోసినట్టు ప్రతీతి. చైర్మన్ కోర్ను రవీందర్‌రెడ్డి, ఈవో సత్యనారాయణ, చిన్నం గణేష్, ఎర్ర నాగేశ్వర్‌రావు, వద్దుల సురేందర్‌రెడ్డి, బిక్షమయ్య, రుద్రారపు ఏలాద్రి, సోమయ్య, శ్రీనివాస్, వీరేందర్, వినయ్, వెంకటాచలం, ప్రసాద్, వెం కన్న, శంకర్, యాకయ్య పాల్గొన్నారు.

వైభవంగా పారువేట

శ్రీవీరభద్రస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజున వీరభద్ర స్వామి వేటకు వెళ్లే కార్యక్రమాన్ని ఆలయ పూజారులు వైభవంగా నిర్వహించారు. గ్రామాన్ని క్రూరదృష్టి నుంచి రక్షించేందుకు ప్రతీ సంవత్సరం బ్రహోత్సవాల్లో ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. గ్రామం చివరన జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో బాజ నాగయ్య, ఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

'తునికాకు టెండర్లను వెంటనే చేపట్టాలి'

గూడూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రాంతాల్లో అన్ని యూనిట్లలో తునికాకు సేకరణ కోసం ప్రభుత్వం వెంటనే టెండర్లు పిలిచి, ప్రూనింగ్ పనులు చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య డిమాండ్ చేశారు. గూడూరులో ఆర్యవైశ్య సంఘం భవనం నుంచి మంగళవారం భారీ ప్రదర్శన నిర్వహించి ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణమే టెండర్లు పిలిచి ప్రూనింగ్ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. 50 ఆకుల కట్టకు రూ.6 చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొట్టెం అచ్చన్న, వజ్జన్న, వర్రె వెంకన్న, కాడబోయిన నరసయ్య, అడ్డూరి వెంకన్న, జోగ వీరస్వామి, పాపయ్య, టేకుమట్ల సమ్మయ్య పాల్గొన్నారు.

రోయింగ్ పోటీలకు కేసముద్రం క్రీడాకారుడు


హేమంత్

కేసముద్రం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మధ్యప్రదేశ్ భోపాల్‌లో ఈనెల 4 నుంచి 8 వరకు నిర్వహిస్తున్న 42వ రోయింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సీనియర్ నేషనల్ ఛాంపియన్ పోటీల్లో కేసముద్రానికి చెందిన నల్లగొండ హేమంత్ పాల్గొంటున్నట్లు జేఎన్‌టీయూ పీడీ ఎన్.అశోక్ మంగళవారం తెలిపారు. గతంలో హేమంత్ రాష్ట్రం తరఫున జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించినట్లు పీడీ తెలిపారు. హేమంత్ ఎంపికపట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రాయల చంద్రబోస్ ఆశయాలను కొనసాగించాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర మాజీ కార్యదర్శి రాయల సుభాష్‌చంద్ర బోస్ ఆశయాలను కొనసాగించాలనిపార్టీ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో చంద్రబోస్ వర్ధంతి సభ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబోస్ సుదీర్ఘకాలం విప్లవోద్యమంలో పనిచేసి భారత విప్లవోద్యమానికి వేగుచుక్కగానిలిచారన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీలుప్రజలకు ఇచ్చిన హామీలను మరిచాయని, వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలో ఈనెల 9న చండ కృష్ణమూర్తి భవనంలో జరిగే వర్ధంతి సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, పూనెం ప్రభాకర్, వీరన్న, బిల్లకంటి సూర్యం, ఉమగాని సత్యం, పైండ్ల యాకయ్య, మైపాషా, జక్కుల యాకయ్య పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలి

● తెలంగాణ మునిసిపల్ సెంట్రల్ ఫోరం నేత సింగు రమేష్


వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందిస్తున్న తెలంగాణ మునిసిపల్ సెంట్రల్ ఫోరం సభ్యులు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో వివిధ ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరికి 2004 సెప్టెంబరు 1 తర్వాత నియామకమైన వారందరికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ మునిసిపల్ సెంట్రల్ ఫోరం మానుకోట జిల్లా ప్రధాన కార్యదర్శి సింగు రమేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారుడు వేం. నరేందర్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సింగు రమేష్ మాట్లాడుతూ పాతపెన్షన్ విధానం అమలు అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని కోరామన్నారు. దేశంలో కొన్ని రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానం అమలు పరిచే నిర్ణయాన్ని తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో కూడా 2004 సెప్టెంబరు 1 తర్వాత నియామకమైన రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులందరికి పాత పెన్షన్ విధానాన్ని అమలు పరిచి ఉద్యోగుల కుటుంబాల్లో భరోసా నింపాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జాతీయ కమిటీ సభ్యుడు మల్‌రెడ్డి రాజశేఖర్ పాల్గొన్నారు.

పాఠశాల భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల నిరసన

కేసముద్రం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : తమ పాఠశాలకు భవనం నిర్మించాలని కోరుతూ కేసముద్రం స్టేషన్ బ్రహ్మంగారితండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ 24 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ పాఠశాలకు పక్కా భవనం లేక అద్దె ఇళ్లలోనే కొనసాగుతున్నట్లు తెలిపారు. 70 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ 18కి చేరినట్లు చెప్పారు. భవనాన్ని పిల్లర్ల వరకే నిర్మించి అర్ధాంతరంగా నిలిపివేశారని వెంటనే పూర్తి చేయాలని వారు కోరారు.

ఘనంగా లైన్‌మెన్ దివస్

ఇనుగుర్తి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం లైన్‌మెన్ దివస్ సందర్భంగా సెక్షన్‌లో పనిచేస్తున్న లైన్‌మెన్లు మలిశెట్టి యశ్వంత్, ఆవుల శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏఈ కుదురుపాక రాజు, ఎల్ఐ బోడ శ్రీను, ఏఎల్ఎంలు అంబేద్కర్, వేణు, నవీన్, కట్టర్స్ జామ్లా, శంకర్, శ్రీను, ఆర్టిజన్ జగన్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వయం పాలన


ఇనుగుర్తి ఉన్నత పాఠశాలలో స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఇనుగుర్తి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఉన్నత పాఠశాలలో డీఈవోగా పైండ్ల వర్షిత, ఎంఈవోగా గుగ్గిళ్ల సాయిచందన, హెచ్‌ఎంగా మారపాక బ్లెసీనా, పీఎస్‌లో హెచ్‌ఎంగా సాయి గణేష్, ఎంఈవోగా తమ్మడపల్లి అక్షిత్, సర్పంచ్‌గా కె.రాకేష్, చైర్మన్‌గా వి.రక్షిత, ఉపాధ్యాయులుగా విద్యార్థులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఐవోబీ మేనేజర్ రమేష్, హెచ్‌ఎంలు అమ్మ యాకయ్య, వీరన్న, ప్రవీణ్, యాదగిరి, వెంకటేశ్వచారారి, రేవతి, సారంగపాణి పాల్గొన్నారు.

తాళ్లపూసపల్లి హైస్కూల్లో

కేసముద్రం, (ఆంధ్రజ్యోతి) : తాళ్లపూసపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం కోట కనకయ్య ఆధ్వర్యంలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎంగా గుగులోత్ అఖిల్, డీఈవోగా గుండ్ల కల్యాణ్, ఉపాధ్యాయులుగా అనిత, మానస, శ్రీదివ్య, భార్గవి, సాహితి, పూజ, రామ్‌చరణ్, ఎం.చరణ్, మని రోహిత్, అరవింద్, సందీప్, కౌశిక్‌లు విద్యార్థులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.వెంకన్న, జి.శ్రీనివాస్, కె.నరేష్‌కుమార్, జి.గోపికృష్ణ పాల్గొన్నారు.

అసత్యప్రచారానికి అడ్డుకట్ట వేయాలి


ఎంపీడీవో యాకయ్యకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్ బాదావత్ సరోజ కిషన్‌నాయక్

నర్సింహులపేట, మార్చి4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోల్ బోడ్కాతండా గ్రామ పంచాయతీ పరిధిలో గడిచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కొందరు రాజకీయ దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ సర్పంచ్ బాదావత్ సరోజ కిషన్‌నాయక్ మంగళవారం ఎంపీడీవో కిన్నెర యాకయ్యకు వినతిపత్రం అందజేశారు. బోడ్కాతండలో బాదావత్ రమేష్‌కు చెందిన సర్వే నెంబరు 277/1/2లో 0.25 ఎకరాల్లో విరాళంగా ఇచ్చిన భూమిలో శ్మశానవాటిక, డంపింగ్ యార్డు, వననర్సరీ ఏర్పాటు చేశామన్నారు. ధన్‌సింగ్‌తండాలో బాదావత్ హరిబాబు విరాళంగా ఇచ్చిన భూమి సర్వే నెంబరు 263/అ/4లో 0.20 ఎకరాల్లో ఐటీడీఏ నిధుల నుంచి రూ.20 లక్షల వ్యయంతో జీపీ నూతన భవనం ఏర్పాటు చేసినట్లు ఫిర్యాదులో వివరించారు. ఎవరి భూమి కబ్జా చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. అభివృద్ధిని చూసి కొందరు తట్టుకోలేకపోతున్నారని, తమపై అసత్య ఆరోపణలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవన్నారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హామీ ఇచ్చినట్లు తెలిపారు.

విద్యా కుసుమానికి ఆర్థిక తోడ్పాటు

● రూ.55 వేలు అందజేసిన దాతలు

నర్సింహులపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఒక్కొక్కరుగా మానవత్వం తోడై.. ఓ విద్యా కుసుమానికి ఉన్నత చదువుల కోసం ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్న ఉదంతం అజ్మీరతండాలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. అజ్మీరతండాకు చెందిన అజ్మీర లచ్చిరాం-చక్రి దంపతులకు నలుగురు ఆడ సంతానం. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం. కూలి పనులకు వెళ్లి ముగ్గురు కూతుళ్ల వివాహం చేశారు. ఫిబ్రవరి మాసంలో లచ్చిరాం అనారోగ్యంతో మృతి చెందాడు. చిన్న కూతురు అజ్మీర నందినికి మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలెంలో బీఎస్సీ నర్సింగ్ ఉన్నత విద్యాభ్యాసం కోసం కళాశాలలో చేర్పించారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం కావడం, తండ్రి లచ్చిరాం ఇటీవల మృతి చెందడంతో నందిని ఉన్నత చదువుకు అడ్డంకిగా మారింది. అది గమనించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అజ్మీర మోహన్ తోటి ఉపాధ్యాయులు, ఆర్థికంగా ఉన్నవారికి సమాచారం అందించి సమస్య వివరించడంతో చలించిన వారు రూ. 55, 500 పోగుచేసి, నందినికి నగదు రూపంలో అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఉన్నత చదువులు పూర్తయ్యేంత వరకు సహకారం అందజేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అజ్మీర సునీత, ఒ.ఝాన్సీ బానోతు నరేష్, అజ్మీర సేవ్యా, వీరన్న, రెడ్డి, నరేష్, శ్రీరాం, రమేష్ ఉన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

● సీపీఎం మండల కార్యదర్శి సత్యవతి

గార్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుక వచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలపై దేశ వ్యాప్తంగా రాజకీయాలకు అతీతంగా ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి కోరారు. రైతువ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు రుణమాఫీ చట్టాన్ని తీసుక వస్తాన చెప్పి బీజేపీ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలం అయిందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో మోదీ ప్రభుత్వం పూర్తి విఫలం కావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీపీఎం, న్యూడెమోక్రసీ నాయకులు కందునూరి శ్రీనివాస్, జంపాల వెంకన్న, కందునూరి శ్రీనివాస్, అంబటి వీరస్వామి, వెంకటేశ్వర్లు, జడ సత్య నారాయణ. జిసక్రు, మాన్య నాయక్, పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

పెద్దవంగర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఎంఈవో బుదారపు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు స్వయం పరిపాలన ద్వారా బోధన అనుభవం, జ్ఞాపకాలు ఎప్పటికీ చిరస్థాయిగా ఉంటాయన్నారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్ కోసం క్రమశిక్షణతో చదవాలని కోరారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులందరూ బాగా చదివి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజలింగం, తఖీపాష, గౌరీశంకర్, రమేష్, శ్రీధర్, ముకేష్, అంజయ్య, శ్రీధర్, సాదయ్య, సారయ్య, సత్యం, కరుణ, ప్రభాకర్, సువర్ణ, హైమా పాల్గొన్నారు.

మరిపెడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ, వీరారం హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన స్వయం పరిపాలన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంతో పాల్గొని, సహచర విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులు డీఈవో, ఎంఈవో, హెచ్‌ఎం విధి నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆ స్కూల్స్ హెచ్‌ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.


మరిపెడ హైస్కూల్‌లో నిర్వహించిన స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

సీతారాంపూర్ స్కూల్‌లో కృత్యమేళా

మరిపెడ, మార్చి4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సీతారాంపూర్ స్కూల్‌లో మంగళవారం ఆ స్కూల్ కాంప్లెక్స్ టీచర్లు కృత్యమేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాంచంద్రయ్య మాట్లాడుతూ పాఠ్య బోధన సామగ్రితో విద్యా బోధన చేస్తే విద్యార్థులకు సులభంగా అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ కాంప్లెక్స్ స్కూల్ టీచర్లు, సీతారాంపూర్ స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు


గాయపడిన శ్వేత

దంతాలపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖమ్మం- వరంగల్ జాతీయ రహదారిపై ఉన్న బీరిశెట్టిగూడెం, పడమటిగూడెం మధ్యలో ఓ మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఇదే సమయంలో ఖమ్మం వైపు నుంచి వస్తున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్ తన సొంత కారులో, తీవ్ర గాయపడ్డ మండలంలోని రేపోణి గ్రామానికి చెందిన శ్వేతను మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యుడు చైతన్య పేర్కొన్నారు.

విద్యుత్ అధికారుల 'పొలం బాట'


మాట్లాడుతున్న ఎస్ఈ నరేష్

కొత్తగూడ, మార్చి4 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అధికారులు నేరుగా వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, అక్కడ ఉన్న కరెంట్ సమస్యలను పరిష్కరించేందుకు, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు 'విద్యుత్ అధికారులు పొలం బాట' కార్యక్రమాన్ని చేపట్టినట్టు మహబూబాబాద్ సర్కిల్ ఎస్ఈ జనగం నరేష్ పేర్కొన్నారు. కొత్తగూడలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎస్ఈ నరేష్ మాట్లాడుతూ మహబూబాబాద్ సర్కిల్ పరిధిలో 185 పొలంబాట కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. కొన్ని విద్యుత్ లైన్లకు మరమ్మత్తు పనులు చేపట్టామని, నూతన స్థంభాలు ఏర్పాటు చేశామన్నారు. మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించామన్నారు. ఆటో స్టార్టర్లు తొలగించాలని రైతులకు సూచించామని పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సేఫ్టీ అధికారులను నియమించామని పేర్కొన్నారు. వినియోగదారులు ఎట్టి పరిస్థితుల్లో స్వంతంగా విద్యుత్ పనులు చేయవద్దని సూచించారు. రైతులకు ఎటువంటి విద్యుత్ సమస్యలు ఉన్న 1912టోల్ ఫ్రీ నెంబర్‌కు చేయాలని సూచించారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు విద్యుత్‌శాఖ సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.